janodaya
# జనోదయ
WWW.JANODAYA.COM
కరీంనగర్ మంగళవారం 13.01.2026 సంపుటి:03 సంచిక:43 పేజీలు:08 వెల : 05
Karimnagar Tuesday 13.01.2026 Volume : 03 Issue : 43 Pages : 08 Cost : 05
తెలుగు దినపత్రిక

## ఊరికి వెళ్తున్నారా..
## జాగ్రత్త..!!




# చలానా పడిన వెంటనే...
## ఖాతా నుంచి డబ్బులు కట్: రేవంత్‌రెడ్డి



**చలాన్ పడగానే బ్యాంక్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్**

**రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3% నష్టం**

**జనవరి 13–24 వరకు 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ఉద్యమం**

**ప్రజలందరూ భాగస్వాములు కావాలన్న డీజీపీ శివధర్‌రెడ్డి.**

**జనోదయ హైదరాబాద్,జనవరి 12:**
చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ''వాహనంపై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చినప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి కట్ కావాలి'' అని రేవంత్ అన్నారు.
రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం మేర నష్టం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోందని, 3 నిమిషాలకో ప్రాణం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద నివారణకు పోలీసుశాఖ ప్రణాళిక చేపట్టిందన్నారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ''సమాజంలో కొందరి నిర్లక్ష్యం మరొకరికి ప్రాణాపాయంగా మారుతోంది.

..మిగతా 2లో

## ఈస్ట్ ఆసియాలో సైబర్ బానిసత్వం నుంచి 22 మంది ఏపీ యువకుల రక్షణ

**అమరావతి | జనవరి 12, (జనోదయ):**
ఈస్ట్ ఆసియా దేశాల్లో సైబర్ నేర ముఠాల చేతుల్లో బానిసలుగా మారిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 22 మంది యువకులను CID పోలీసులు రక్షించారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసి విదేశాలకు పంపించి, అటవీ ప్రాంతాల్లోని రహస్య కేంద్రాల్లో నిర్బంధించి సైబర్ మోసాలకు బలవంతం చేస్తున్నట్లు CID ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు. బ్యాంకాక్, మయన్మార్, కంబోడియా వంటి దేశాల్లో మంచి జీతం ఉన్న ఉద్యోగాలు అంటూ టెలిగ్రామ్, సోషల్ మీడియా ద్వారా యువతను ఆకర్షించి, పాస్‌పోర్టులు, ఫోన్లు లాక్కొని రోజుకు 18 గంటలపాటు పని చేయిస్తున్నారని తెలిపారు. ఆదేశాలు పాటించని వారిపై దాడులు, విద్యుత్ షాకులు వంటి హింసకు పాల్పడుతున్నట్లు బాధితులు తెలిపారు. తప్పించుకోవాలంటే రూ.10 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని, ఆయుధాలతో ఉన్న గార్డుల మధ్య కఠిన భద్రతలో ఉంచుతున్నారని సిఐడి పేర్కొంది. ఇటీవల రక్షించబడిన యువకులను స్వదేశానికి తీసుకువచ్చి విచారణ చేపట్టినట్లు తెలిపింది.
విదేశీ ఉద్యోగ ఆఫర్ల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ప్రకటనలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిఐడి హెచ్చరించింది.




## కదులుతున్న కారులో యువతిపై గ్యాంగ్ రేప్

**కళాశాలకు వెళుతున్న యువతిని గ్యాంగ్ రేప్**

**గంటలపాటు కదులుతున్న కారులో**

**ఆమెపై అఘాయిత్యం**



**జనోదయ,,జనవరి 12:**
ఇంటినుంచి కళాశాలకు వెళుతున్న యువతిని అడ్డగించి ఆమెపై గ్యాంగ్ రేప్‌నకు పాల్పడిన ఘటన రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 6న యువతి కళాశాలకు వెళ్తుండగా ఇద్దరు యువకులు అడ్డగించి ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించి నాపసర్ ప్రాంతంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. కొన్ని గంటలపాటు కదులుతున్న కారులో ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో కారు ఓ గ్రామంలోకి ప్రవేశించడంతో స్థానికులు అనుమానం వచ్చి ఆపారు. దీంతో యువతిని కారులో నుంచి బయటకు తోసేసి అక్కడ్నుంచి నిందితులు పారిపోయారు. గ్రామస్థులు బాధిత యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జనవరి 11న భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కేటీఆర్ చాలా ఎక్కువ ఊహించుకుంటున్నారు: కాంగ్రెస్ ఎమ్మెల్యే

**సీఎంని తిడితే పెద్దోడిని అవుతానని కేటీఆర్ అనుకుంటున్నారని, తాము తల్చుకుంటే కేటీఆర్‌కు మించిన తిట్లు తిట్టగలం.. కానీ మా పార్టీ మాకు సంస్కారం నేర్పిందని చెప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.**




## పోలవరం–నల్లమల సాగర్ విషయంలో తెలంగాణ జలహక్కులను ద్రోహం హరీశ్‌రావు

**సుప్రీంకోర్టులో బలహీన పిటిషన్‌తో తెలంగాణ జలహక్కులకు ద్రోహం.**

**రిట్ ఉపసంహరణతో ఏపీకి ప్రాజెక్టు పూర్తిచేసుకునే అవకాశం.**

**ఇది చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన "సంక్రాంతి కానుక" అని విమర్శ.**

**జలహక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరిక.**




**జనోదయ | హైదరాబాద్ | జనవరి 12::**
పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వపు న్యాయపరమైన స్థితిని ఉద్దేశపూర్వకంగా బలహీనపరిచి, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు దోహదపడేలా ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత టీ. హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ న్యాయపరంగా నిలబడని విధంగా ఉందని, దీంతో సీఎం రేవంత్‌రెడ్డి "నిజ స్వరూపం, ద్రోహ మనస్తత్వం" బహిర్గతమైందని హరీశ్‌రావు ఆరోపించారు. గతంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతుల మద్దతుతో రిట్ పిటిషన్లు దాఖలు చేసి, ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులపై స్టే సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.
"ఇలాంటి పిటిషన్ కోర్టులో నిలబడదని ప్రభుత్వ న్యాయసలహాదారులు గానీ, సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ గారు గానీ సీఎంకు చెప్పలేదా?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేవలం బలహీనమైన న్యాయ వ్యూహాన్ని సమర్థించేందుకు సాగునీటి మంత్రి అధికారిక దుస్తుల్లో ఢిల్లీకి వెళ్లడం అవసరమా? అని విమర్శించారు.

02

# దివ్యాంగుల కోసం ₹50 కోట్ల సహాయక పరికరాల పథకం ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**దివ్యాంగుల కోసం రాష్ట్ర చరిత్రలో తొలిసారి ₹50 కోట్లతో సహాయక పరికరాల పంపిణీ పథకం ప్రారంభం.**
**మోటరైజ్డ్ వాహనాలు, వీల్‌చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు ఉచితంగా అందజేత.**
**దివ్యాంగుల వివాహానికి ₹2 లక్షల ఆర్థిక సహాయం, విద్యా–ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు భరోసా.**
**ట్రాన్స్‌జెండర్లకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, వృద్ధుల కోసం 'ప్రణామ్' డేకేర్ కేంద్రాల ఏర్పాటు.**
**ట్రాన్స్‌జెండర్లకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, వృద్ధుల కోసం 'ప్రణామ్' డేకేర్ కేంద్రాల ఏర్పాటు.**



**జనోదయ హైదరాబాద్,జనవరి 12:**
దివ్యాంగులు (వికలాంగులు) గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో, సమాన అవకాశాలతో జీవించాలన్న మానవతా దృక్పథంతో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద రీట్రోఫిట్ చేసిన మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు, బ్యాటరీ వీల్‌చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు సహా ఆధునిక సహాయక పరికరాలను దివ్యాంగులకు ఉచితంగా అందించనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఈ పథకానికి రూ.50 కోట్ల భారీ నిధులు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు.
ప్రభుత్వం దివ్యాంగుల పక్షాన కుటుంబ సభ్యుడిలా నిలబడి ధైర్యం, భరోసా ఇవ్వాలన్న సంకల్పంతో ఈ నిధులను కేటాయించిందని సీఎం చెప్పారు. విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులకు న్యాయమైన రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టం చేశారు. అలాగే దివ్యాంగుల వివాహానికి ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు.
దివ్యాంగులు (వికలాంగులు) గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో, సమాన అవకాశాలతో జీవించాలన్న మానవతా దృక్పథంతో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద రీట్రోఫిట్ చేసిన మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు, బ్యాటరీ వీల్‌చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు సహా ఆధునిక సహాయక పరికరాలను దివ్యాంగులకు

..మిగతా 2లో

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు విద్యారంగంలో గేమ్‌చేంజర్స్

• డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ | జనవరి 12:
తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రాజెక్టు విద్యారంగంలో గేమ్‌చేంజర్‌గా, డ్రీమ్ ప్రాజెక్టుగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, చీఫ్ సెక్రటరీతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాలల నిర్మాణ పురోగతిని సమీక్షించారు.
ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని స్పష్టం చేసిన ఆయన, టెండర్లు ఖరారైన వెంటనే మంత్రులు లేదా స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో భూమిపూజలు, శంకుస్థాపనలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల నిర్మాణానికి కచ్చితమైన టైమ్‌లైన్ ఖరారు చేసి, ప్రతి వారం పురోగతి సమీక్షలు చేయాలని, నెలకు కనీసం ఒకసారి పాఠశాల స్థలాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు.
నిధుల కొరత ఏమీ లేదని, కాంట్రాక్టర్లకు ప్రతి 15 రోజులకు బిల్లులు విడుదల చేస్తున్నామని భట్టి విక్ర

..మిగతా 2లో

# చలానా పడిన వెంటనే...ఖాతా నుంచి డబ్బులు కట్: రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి. ఫిజికల్ క్రైమ్‌తో పాటు సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీటి నియంత్రణలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది''అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఈ ఉద్యమంలో అందరూ పాల్గొనాలి: డీజీపీ శివధర్‌రెడ్డి

ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. విస్తృత అవగాహనతో మరణాల సంఖ్య తగ్గిందని చెప్పారు. అందరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జనవరి 13 నుంచి 24 వరకు పది రోజుల పాటు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.



# కేటీఆర్ చాలా ఎక్కువ ఊహించుకుంటున్నారు: కాంగ్రెస్ ఎమ్మెల్యే

మొదటిపేజీ తరువాయి

సీఎంని తిడితే పెద్దోడిని అవుతానని కేటీఆర్ అనుకుంటున్నారని, తాము తల్చుకుంటే కేటీఆర్‌కు మించిన తిట్లు తిట్టగలం.. కానీ మా పార్టీ మాకు సంస్కారం నేర్పిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉండటాన్ని కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని, రేవంత్ రెడ్డికి, కేటీఆర్‌కి నక్కకి నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. సోమవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. సీఎం పైన మాట్లాడే స్థాయి, నైతికత కేటీఆర్‌కు లేదని, సీఎంని తిట్టే రాక్షసానందం పొందే ప్రయత్నం ఆయన చేస్తున్నాడు.. ప్రజల్లో కేటీఆర్ చులకన అవుతున్నారన్నారు.

కేటీఆర్ చాలా ఎక్కువ ఊహించుకుంటున్నారు ఏ ఎన్నిక వచ్చినా విజయం కాంగ్రెస్ పార్టీదే విజయమని, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది.. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 శాతం సీట్లను గెలవబోతుందన్నారు. కేటీఆర్ తనకు తాను చాలా ఎక్కువ ఊహించుకుంటున్నాడు.. బీఆర్ఎస్ పని ముగిసింది.. ఆ పార్టీ చేతిలో మరోసారి మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని మేడిపల్లి సత్యం అన్నారు. ఇంకో దశాబ్దం వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుంది.. రేవంత్ రెడ్డి సీఎంగా ఉంటారు.. ఆయన నాయకత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారు.. బీఆర్ఎస్, బీజేపీ కలిసి వచ్చినా, ఇంకొందరిని కలుపుకుని గుంపుగా వచ్చినా సీఎంని కదిలించలేరన్నారు. కవిత అన్ని విమర్శలు చేస్తుంటే కుక్కిన పేనులా కేటీఆర్, హరీష్ రావు ఉన్నారు.. మీరు ఏమీ తప్పు చేయకపోతే కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు.

బీజేపీకి పేర్లు మార్చడం తప్ప వేరే రాజకీయాలు లేవు: మాజీ ఎంపీ వీహెచ్

బీజేపీ వాళ్లకు పేర్లు మార్చడం తప్ప వేరే రాజకీయాలు లేవని, పేదల కోసం ఆ పార్టీ ఒక్క పని చేయలేదని మాజీ ఎంపీ వీ.హన్మంతరావు మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం దేశ స్వరాజ్యం అని చెప్పిన మహాత్మా గాంధీ పేరు ఈ దేశానికి పెట్టాలని పెరియార్ అన్నారని, పేదలకు ఎంతో ఉపాధి ఇచ్చే పథకం పేరును గాంధీ పేరుతో పెట్టాలని సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్‌లు ఎంతో ఆలోచించి పెట్టారన్నారు. ఆ పథకం పేరును మార్చడం విచారకరమన్నారు.



# దివ్యాంగుల కోసం ₹50 కోట్ల సహాయక పరికరాల పథకం ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఈ పథకానికి రూ.50 కోట్ల భారీ నిధులు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు.

ప్రభుత్వం దివ్యాంగుల పక్షాన కుటుంబ సభ్యుడిలా నిలబడి ధైర్యం, భరోసా ఇవ్వాలన్న సంకల్పంతో ఈ నిధులను కేటాయించిందని సీఎం చెప్పారు. విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులకు న్యాయమైన రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టం చేశారు. అలాగే దివ్యాంగుల వివాహానికి ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. క్రీడల రంగంలో కూడా దివ్యాంగులకు ప్రోత్సాహం ఇస్తున్నామని సీఎం తెలిపారు. పారాలింపిక్స్‌లో ప్రతిభ చూపిన ఓ యువతికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో దివ్యాంగులు వెనుకబడకుండా అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని లబ్ధిదారులకు సూచించారు.

దివ్యాంగులకు ప్రేరణగా మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డిని సీఎం గుర్తు చేశారు. శారీరక లోపాన్ని అడ్డంకిగా భావించకుండా దేశంలోనే అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా ఎదిగిన వ్యక్తిగా ఆయనను ఉదాహరణగా పేర్కొన్నారు.

రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్ వ్యక్తిని కోఆప్షన్ సభ్యుడిగా, కార్పొరేటర్‌గా నియమించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. స్థానిక సంస్థల్లో వారి సమస్యలు నేరుగా వినిపించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

సామాజిక సంక్షేమ చర్యలపై మాట్లాడిన సీఎం, వృద్ధుల కోసం "ప్రణామ్" డే కేర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే, వారి జీతంలో నుంచి 10 శాతం నేరుగా తల్లిదండ్రుల ఖాతాలో జమయ్యేలా చట్టం తీసుకురావాలన్న ప్రతిపాదన కూడా ఉందని వెల్లడించారు.



రాష్ట్రంలో 100 శాతం ఆరోగ్య రక్షణ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, రాబోయే బడ్జెట్ సమావేశాల్లో సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రవేశపెడతామని సీఎం తెలిపారు. కుల గణన నిర్వహించడం, ఎస్సీ ఉపవర్గీకరణ అమలు చేయడం ద్వారా తెలంగాణ దేశానికి సామాజిక న్యాయంలో మోడల్ రాష్ట్రంగా నిలిచిందని అన్నారు.

అన్ని వర్గాల ప్రజలు కలిసి పనిచేస్తేనే తెలంగాణను దేశానికి ఆదర్శ సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమని పిలుపునిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.



## పోలవరం–నల్లమల సాగర్ విషయంలో తెలంగాణ జలహక్కులను ద్రోహం చేశారు: హరీశ్‌రావు



రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకొని, సివిల్ సూట్ వేస్తామని చెప్పడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నల్లమల సాగర్ ప్రాజెక్టును పూర్తిచేసుకునేందుకు కీలక సమయం ఇచ్చినట్లే అవుతుందని హరీశ్‌రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలను కలిపి దీర్ఘకాలిక విచారణలు జరిగితే న్యాయం ఆలస్యం అవుతుందని, ఆ లోపు ఆంధ్రప్రదేశ్ నీటిని మళ్లించి ప్రాజెక్టు పూర్తి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సుప్రీంకోర్టులో బలహీనమైన పిటిషన్ వేయడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇచ్చిన "సంక్రాంతి కానుక"గా హరీశ్‌రావు అభివర్ణించారు. అజెండా లేదంటూనే ఢిల్లీలో సమావేశాలకు హాజరుకావడం, బనకచర్ల వంటి వివాదాస్పద ప్రాజెక్టులపై చర్చలు జరపడం, ముందుగా ఒప్పందాలు లేవంటూ చెప్పి తర్వాత సంతకాలు చేయడం, కమిటీల పేరుతో ఆంధ్రప్రదేశ్ నీటి మళ్లింపుకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నాలు చేయడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తోందని ఆరోపించారు. టెండర్లు ఖరారైన తర్వాత మాత్రమే సుప్రీంకోర్టును ఆశ్రయించడం ద్వారా నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపినట్లేనని హరీశ్‌రావు విమర్శించారు. ప్రాజెక్టును అడ్డుకుంటామని, న్యాయపోరాటం చేస్తామని ప్రజలను మభ్యపెట్టి, చివరకు తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా బలహీనమైన కేసు వేశారని ఆరోపించారు. ఈ అంశంపై బీఆర్ఎస్ మౌనం పాటించదని స్పష్టం చేసిన హరీశ్‌రావు, తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాల కోసం ప్రజల్లోకి వెళ్లి పోరాటం చేస్తామని, అవసరమైతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు విద్యారంగంలో గేమ్‌చేంజర్స్

విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లను ఒకే క్యాంపస్‌లో సమీకరించడం ద్వారా సామాజిక సమైక్యతకు బలమైన సందేశం ఇస్తున్నామని అన్నారు. ఈ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండి, తెలంగాణ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తయారుచేస్తాయని పేర్కొన్నారు.

ఒప్పందం కుదిరిన 15 రోజుల్లోపు పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. భూసంబంధిత లేదా పరిపాలనా సమస్యలు తలెత్తితే స్థానిక ఎమ్మెల్యేలు, సీసీఎల్ఏ లేదా చీఫ్ సెక్రటరీ స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. నిర్మాణ నాణ్యతను పర్యవేక్షించేందుకు మూడవ పక్ష నాణ్యత తనిఖీ సంస్థను నియమించి, వారానికి ఒకసారి పురోగతి నివేదికలు చీఫ్ సెక్రటరీకి పంపించాలని ఆదేశించారు.

రాబోయే విద్యాసంవత్సరానికి గరిష్ట సంఖ్యలో స్కూళ్లు ప్రారంభించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నాణ్యమైన మౌలిక సదుపాయాలతో సమగ్ర విద్య అందిస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి అత్లూరి లక్ష్మణ్, ఎంపీ బాలరాం నాయక్, చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, టీజీ డబ్ల్యూడీసీ ఎండీ గణపతి రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర వసతులతో ఒకే పైకప్పు కింద ప్రపంచస్థాయి విద్య అందించే ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు దేశానికే ఆదర్శంగా నిలవనున్నాయని ప్రభుత్వం పేర్కొంది.



# ప్రజావాణిలో రేషన్ షాప్ మంజూరు పిటిషన్

**జనోదయ, మందమర్రి జనవరి 12:**

మండలం లోని శంకరపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రేషన్ షాప్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ వార్డు సభ్యులు దూట తిరుపతి కోరారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపిడిఓ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఏర్పడి ఏడు సం,,లు పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు రేషన్ షాప్ ఏర్పాటు చేయకపోవడం వలన గ్రామస్తులు సుదూర ప్రాంతంలోని సారంగపల్లి గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే గ్రామంలో రేషన్ షాప్ ను ఏర్పాటు చేయాలని కోరారు.



# కారుకూరి రాంచందర్ ను సస్పెండ్ చేయాలని పాత్రికేయుల ఆందోళన

## ఎమ్మెల్యే వినోద్ కు వినతి పత్రం అందజేత

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 12:**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పై ఇటీవల ఎన్టీవీ లో వచ్చిన వార్త కథనంపై మాజీ జడ్పిటిసి కారుకూరి రాంచందర్ ఎన్టీవీ రిపోర్టర్ అందుగుల రమేష్ ను అసభ్య పదజాలంతో దూషించడం పట్ల సోమవారం బెల్లంపల్లి నియోజకవర్గంలోని పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీవీ రిపోర్టర్ రమేష్ ను పత్రికల్లో రాయలేని విధంగా దూషించిన నాయకుడు రామచందర్ ను కాంగ్రెస్ పార్టీ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ముందుగా పాత్రికేయులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఏఎంసి నుండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. వార్తా కథనాలపై రిపోర్టర్లను బెదిరింపులకు గురిచేస్తున్న అనుచరులకు ఎమ్మెల్యే మద్దతు గా నిలుస్తున్నారని నినదిస్తూ పాత్రికేయులు ఆందోళన కు దిగారు. క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో ఈ సమస్యపై కొంతమంది పాత్రికేయులను మాట్లాడేందుకు లోపలికి రావలసిందిగా ఎమ్మెల్యే కోరినప్పటికీ పాత్రికేయులు అంగీకరించలేదు. దీంతో ఎమ్మెల్యే గడ్డం వినోద్ తానే బయటికి వచ్చి డెమొక్రసీ పద్ధతిలో మాట్లాడడానికి తాను సిద్ధమని, అన్ డెమొక్రసీ పద్ధతిలో వ్యవహరిస్తే తాను అదే పద్ధతి పాటిస్తానని తెగేసి చెప్పారు. దీంతో ఎమ్మెల్యే గడ్డం వినోద్, పాత్రికేయుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్టీవీ రిపోర్టర్ రమేష్ ను అసభ్యంగా దూషించిన నాయకులు కార్కూరి రామ్ చందర్ ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, ఎన్టీవీ రిపోర్టర్ రమేష్ కు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ





పాత్రికేయులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై విచారిస్తానని పాత్రికేయులకు చెప్పి ఎమ్మెల్యే వినోద్ క్యాంపు కార్యాలయంలోకి వెళ్లిపోయారు. అనంతరం కొంతమంది పాత్రికేయులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్ తో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పులియాల రాజు (ఆంధ్రప్రభ), పూదరి నగేష్ (మనం), మేకల ప్రభాకర్ (మన తెలంగాణ), వేముల వెంకటేష్ (ప్రజాతీర్పు), దామెర విజయ్ (నమస్తే తెలంగాణ), కృష్ణమూర్తి (ఆంధ్రజ్యోతి), రాధాకృష్ణ రావు (టీవీ9), కోల వెంకటేష్ (ఫోర్ సైట్స్), ఉప్పులేటి లక్ష్మణ్ (విజయ క్రాంతి), బద్రి వెంకటేష్ (ప్రజా దర్బార్), కలువల ప్రతాప్ (ప్రైమ్ 9టీవీ), తిరుపతి (రాజ్ న్యూస్), శ్రీనివాస్ (వి6 టీవీ), వికాస్ యాదవ్ (శణార్తి తెలంగాణ), మల్లేష్ (నవ తెలంగాణ) లతోపాటు భీమిని, నెన్నెల్, కాసిపేట, తాండూర్ మండలాలకు చెందిన వివిధ దినపత్రికలు, న్యూస్ ఛానెళ్ల పాత్రికేయులు పాల్గొన్నారు.

# వ్యాపార సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం

జనోదయ మందమర్రి జనవరి 12: పట్టణంలోని పాత బస్టాండ్ వర్తక సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన వడ్లకొండ కనకయ్య గౌడ్ బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యాపార సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కనకయ్యను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ, జిల్లా నాయకులు నోముల ఉపేందర్ గౌడ్ లు మాట్లాడుతూ వ్యాపార సంఘం ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కనకయ్య గౌడ్ పాత బస్టాండ్ వ్యాపారస్తు



లకు అందుబాటులో ఉండి నిరంతరం వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సంఘం అభివృద్ధికి, వ్యాపారస్తుల సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు. చిరు వ్యాపారుల వ్యాపార అభివృద్ధికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు చిలగాని సుదర్శన్, వైశ్య సంఘం నాయకులు రాచర్ల రవి, బిఎస్పి జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్, శ్యామల విద్యాసాగర్ బైరాజు శ్రీనివాస్, సత్యంబాబు ఆంజనేయులు, శంకరయ్య బుచ్చయ్య యాదవ్, మహేష్ యాదవ్, నూతి ఆంజనేయులు, కొంతం రాజు, రంజిత్ లు పాల్గొన్నారు

# సర్వరెడ్డిపల్లి మర్రిగడ్డలో వివేకానంద జయంతి వేడుకలు

- ఎస్సై వంశీకృష్ణ నివాళులు

**జనోదయ హైదరాబాద్, డిసెంబర్ 27:**

గంగాధర మండల పరిధిలోని సర్వరెడ్డిపల్లి మర్రిగడ్డ గ్రామంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. గంగాధర మండలంలో మరెక్కడా లేని విధంగా కేవలం ఈ గ్రామంలోనే స్వామి వివేకానంద విగ్రహం ఉండటం విశేషం. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా గంగాధర ఎస్సై వంశీకృష్ణ విచ్చేసి, విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ.. మండలంలోనే ఉన్న ఏకైక వివేకానంద విగ్రహం వద్ద జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కరబూజ తిరుపతి మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఈ విగ్రహం వద్ద యువతతో కలిసి వేడుకలు నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి (సెక్రెటరీ) గారు మాట్లాడుతూ, వివేకానందుని సిద్ధాంతాలు సమాజ మార్పుకు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ యూత్ ప్రెసిడెంట్ అరవేణి కనకయ్య, మాట్లాడుతూ, వివేకానందుడి ఆశయ సాధనలో మర్రిగడ్డ గ్రామ యువత ఎల్లప్పుడూ ముందుంటుందని, ఆయన చూపిన బాటలో నడుస్తామని స్పష్టం చేశారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద బోధనలు నేటి తరానికి ఎంతో అవసరమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ యూత్ మర్రిగడ్డ సభ్యులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జనవరి 12, 2026: జనోదయ మంచిర్యాల జిల్లా ప్రతినిధి**

జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.



# జగిత్యాలలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి.

## సీఎం కప్ టార్చ్ ర్యాలీ

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, జనవరి 12**

జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. దేశభవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలం కూడా పెరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ, యువతలో జాతీయ భావన, సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు.

అనంతరం సీఎం కప్ ఎడిషన్-2 కార్యక్రమానికి సంబంధించిన టార్చ్ ర్యాలీని అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో యువకులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన టార్చ్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువల జ్యోతి, లక్ష్మణ్, గోలి శ్రీనివాస్, డీవైఎస్వో రవి, ముస్కు ఎల్లారెడ్డి, చెట్పల్లి సుధాకర్, చుక్క నవీన్, ప్రభాత్ సింగ్ ఠాగూర్, కృష్ణ ప్రసాద్ ,మాజీ కౌన్సిలర్లు,



## ఇందిరమ్మ ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేయాలి

**ఎంపీడీవో రాజేశ్వర్**

**జనోదయ, మందమర్రి జనవరి 12:**
మండలం లోని ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్ కోరారు. మండలంలోని బొక్కల గుట్ట, పులిమడుగు అందుగులపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేసి ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు అధికారుల సూచన మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ఇంటి నిర్మాణంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయాల నూతన భవనాలను పూర్తి చేయాలని సూచించారు. అంతే కాకుండా గ్రామాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను చర్చించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు మాసు శ్రీనివాస్, భూక్యా బుజ్జి, ముత్యం రమ,పంచాయతీ రాజ్ ఎఈ ఇసాక్, గ్రామ కార్యదర్శులు వీరేందర్, సురేష్ లు పాల్గొన్నారు.



## టైక్వాండో నేషనల్ ఛాంపియన్షిప్ పోటీల్లో రైల్వే ఇన్స్టిట్యూట్ విద్యార్థుల ప్రతిభ

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 12 :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని తలారి మాత్ స్టేడియం లో నిర్వహించిన మహంకాళి టైక్వాండో నేషనల్ ఛాంపియన్షిప్ లో బెల్లంపల్లి రైల్వే ఇనిస్టిట్యూట్ కు చెందిన విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించారు. రైల్వే ఇన్స్టిట్యూట్ కు చెందిన విద్యార్థులు ప్రమోద్ కుమార్, జి . శ్రేణిత్ సాయి లను సోమవారం రైల్వే ఏ డి ఈ ఎన్ గోపి, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టైక్వాండో టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ జిల్లపల్లి వెంకటస్వామి, శిక్షకులు అజయ్ లు ఉన్నారు.



## ఊరికి వెళ్తున్నారా.. జాగ్రత్త..!

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 12:**
సంక్రాంతి పండగకు ఊరికి వెళితే ఇంట్లో విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సోమవారం బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాస రావు సూచించారు. ఖరీదైన బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచి ఊరికి వెళ్లవద్దని కోరారు. బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. తమ ఇంటిని వదిలి సొంత గ్రామాలకు వెళ్లాల్సివస్తే విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా పగడ్బందీగా తాళాలు వేసుకొని వెళ్లాలన్నారు. తమ ఇంటి ఆవరణలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సెలవులకు ఊరెళితే ముందుగా బీట్ ఆఫీసర్ కు గానీ, పోలీస్ స్టేషన్లో గాని ఫిర్యాదు అందిస్తే పెట్రోలింగ్ పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల తమ ఇంటి ఆవరణలో ఉండే సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను అరికట్టే అవకాశం ఉంటుందని సూచించారు.




# ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు

**జనోదయ,గోదావరిఖని జనవరి 12:**





ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు 8వ కాలనీలో ఘనంగా నిర్వహించారు.భారతీయ సనాతన ధర్మ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్ముడు, తన సందేశాలతో భారత జాతిని జాగృతం చేసిన యుగపురుషుడు స్వామి వివేకానందుడిని స్మరిస్తూ యువత గౌరవ నివాళులు అర్పించింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనత యువ మోర్చా 8వ కాలనీ మండల అధ్యక్షుడు ఐలవేణి అనిల్ కుమార్ హాజరై స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు రామంచ శ్రావణ్, అఖిల్ గౌడ్, అడ్వకేట్ సురేష్ పటేల్, లింగం నాయక్ తదితరులు కూడా విగ్రహానికి పూలమాలలు వేసి మహనీయుడిని స్మరించారు. యువతలో దేశభక్తి, ధార్మిక చైతన్యం, సామాజిక బాధ్యతను నాటిన స్వామి వివేకానంద సందేశాలు నేటి తరానికి మార్గదర్శకమని వక్తలు పేర్కొన్నారు. యువత తమ జీవిత లక్ష్యాలను ఉన్నతంగా మలుచుకొని, దేశ సేవే పరమావధిగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ అధ్యక్షుడు రామంచ శ్రావణ్, జంగపెల్లి అరవింద్‌తో పాటు విక్కీ, అనిల్, సాయి, శివ, జితేంద్ర, ప్రవీణ్, ప్రణవ్, గని, బుర్రి అఖిల్, సాయి జస్వంత్, ఈశ్వర్ నాయక్, స్పందన స్కూల్ విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా విజయవంతం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి


బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 12:**
త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. సోమవారం బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో 34 వార్డుల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరువ చేస్తుందన్నారు. మహిళలకు, రైతులకు, యువతకు ఇచ్చిన హామీలను శక్తి వంచన లేకుండా అమలు చేస్తుందన్నారు. పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు అంకిత భావంతో పనిచేస్తే తప్పక విజయం సాధిస్తామన్న భీమా వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ, త్రాగు నీటి సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం. సూరిబాబు, మునిమంద రమేష్, చిలుముల శంకర్, కంకటి శ్రీనివాస్, అన్ని వార్డులకు సంబంధించిన మాజీ కౌన్సిలర్లు, మహిళ ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.


హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు

# ఆచంపల్లి ఎల్లమ్మ ఆలయంలో హుండీ దోపిడీ

## రూ.30 వేల నగదు అపహరణ

**జనోదయ – గంగాధర | జనవరి 12:**
గంగాధర మండలం ఆచంపల్లి గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లిన ఘటన సోమవారం వెలుగుచూసింది.
వివరాల ప్రకారం, జనవరి 06న ఉదయం ఆలయ పూజారి పూజలు నిర్వహించిన అనంతరం గుడికి తాళం వేసి వెళ్లారు. అనంతరం జనవరి 12న త్వరలో జరగబోయే ఎల్లమ్మ పట్నాల ఏర్పాట్ల కోసం ఆలయానికి వచ్చిన గ్రామస్థులు గేటు తాళం, తలుపులు పగలగొట్టబడి ఉండటాన్ని గమనించారు. ఆలయంలోని హుండీ తాళం కూడా విరగదీసి అందులో ఉన్న నగదును దోచుకెళ్లినట్లు గుర్తించారు. హుండీలో సుమారు రూ.30,000 వరకు నగదు ఉండవచ్చని ఆచంపల్లి గ్రామానికి చెందిన ఆరే అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.


గ్రామస్తులను వివరాలు అడిగి తెల్సుకుంటున్న పోలీసులు



ఆలయ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు లేకపోవడం దొంగలికి అనుకూలంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్నాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో భద్రత చర్యలు కట్టుదిట్టం చేయాలని వారు కోరుతున్నారు. పోలీసులు అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# చైనా మాంజాపై నిషేధం కఠినంగా అమలు – వినియోగించినా కేసులు తప్పవు –SI వంశీకృష్ణ

**జనోదయ –గంగాధర | జనవరి 12:** సంక్రాంతి పండుగ సందర్భంగా నిషేధిత చైనా మాంజా వినియోగం, విక్రయం, నిల్వపై కఠిన చర్యలు తీసుకుంటామని గంగాధర ఎస్సై వంశీకృష్ణ హెచ్చరించారు. చైనా మాంజా పర్యావరణానికి, మానవ జీవాలకు తీవ్ర ప్రమాదకరమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నైలాన్ దారంతో తయారయ్యే చైనా మాంజా వల్ల పక్షులు గాయపడటం, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయాల పాలవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా చైనా మాంజాపై పూర్తిస్థాయి నిషేధం అమలులో ఉందని గుర్తు చేశారు. మండల వ్యాప్తంగా చైనా మాంజా అమ్మకాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు, షాపులు, గోదాముల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి చైనా మాంజాను తయారు చేసినా, విక్రయించినా లేదా నిల్వ ఉంచినా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పతంగులు ఎగరేసేటప్పుడు కేవలం సాధారణ కాటన్ దారాలనే వినియోగించాలని, విద్యుత్ లైన్ల సమీపంలో, రద్దీ రోడ్లపై లేదా జనసమూహం ఉన్న ప్రాంతాల్లో పతంగులు ఎగరవేయవద్దని ప్రజలకు సూచించారు. చుట్టుపక్కల ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించి ఈ సంక్రాంతిని ఎటువంటి ప్రమాదాలు లేకుండా సురక్షితంగా జరుపుకోవాలని ఎస్సై వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు.



# పెద్దమ్మ తల్లి గుడి ప్రహరీ గోడకు భూమి పూజ – సర్పంచ్ దూలం కళ్యాణ్ కుమార్

**గంగాధర జనోదయ, జనవరి 12:** గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి గుడి ప్రహరీ గోడ నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దూలం కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రహరీ గోడ నిర్మాణాన్ని తన సొంత నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ఈ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అన్నాల్ దాస్ తిరుపతి, వార్డు సభ్యులు, బొమ్మకటి రాజిరెడ్డి, మహేష్, గంగయ్య,శ్రీధర్, గణేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముధిరాజ్ సంఘం అధ్యక్షులు బైరి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు రాగం సత్తయ్య, మత్స్య శాఖ అధ్యక్షులు బైరి వెంకటయ్య, బైరి చంద్రయ్య, బైరి సత్తయ్య, రాగం పెద్ద లచ్చయ్య, రాగం చిన్న నర్సయ్య, ఇండ్ల నర్సయ్య, ఇండ్ల శ్రీనివాస్, గుడెల్లి సత్తయ్య, గుడెల్లి సంజీవ్, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# బెల్లంపల్లి మున్సిపల్ తుది ఓటరు జాబితా ప్రతుల విడుదల

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 12:**
బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో గల 34 వార్డులకు సంబంధించిన తుది ఓటరు జాబితా ప్రతులను సోమవారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మున్సిపల్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. తుది ఓటరు జాబితాల ప్రతులను బెల్లంపల్లి పురపాలక సంఘ కార్యాలయం, తహసిల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయ నోటీసు బోర్డులపై ఉంచనున్నట్లు చెప్పారు. మున్సిపల్ పరిధిలో 44575 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 21560 మంది పురుషులు, 23012 మంది మహిళా ఓటర్లతో పాటు ఇతరులు ముగ్గురు ఉన్నట్లు కమిషనర్ తన్నీరు రమేష్ వెల్లడించారు.



ఓటరు జాబితా ప్రతులను విడుదల చేస్తున్న కమిషనర్ రమేష్, మున్సిపల్ సిబ్బంది

# “విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట ” రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**జనవరి 12, 2026: జనోదయ మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కి పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహ భవనాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ, అదనపు గదుల నిర్మాణం ఇతర అభివృద్ధి పనులు చేపట్టి విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

అనంతరం కోటపల్లి మండలం కొల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మైనింగ్ ఎ.డి. జగన్మోహన్ రావు, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో ఆన్ లైన్ లో మన ఇసుక వాహనం వెబ్ సైట్ ద్వారా ఇసుకను బుక్ చేసుకున్న వినియోగదారులకు తక్కువ ధరకు అధికారికంగా ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వానికి పన్ను నష్టం జరుగుతుందని, సరైన విధంగా ఇసుకను అందించి ప్రభుత్వం పొందే పన్ను ద్వారా మరింత మంది అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ లలో జిపిఎస్, డ్రోన్, సాటిలైట్ల ద్వారా ఇసుక త్రవ్వకాలు, రవాణా వ్యవస్థను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, వినియోగదారులకు సకాలంలో ఇసుకను తక్కువ ధరకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ అభివృద్ధి నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం పంపిణీ ఇతర పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.





జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి మండలాల వారీగా ఆన్ లైన్ మన ఇసుక వాహనం బుకింగ్ ప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు. ముల్కల్ల ఇసుక రీచ్ నుండి మందమర్రి, క్యాతనపల్లి, ఇందారం ఇసుక రీచ్ నుండి జైపూర్, భీమారం, కొల్లూర్ ఇసుక రీచ్ నుండి కోటపల్లి, చెన్నూర్, వేమనపల్లి ప్రాంతాలకు నిబంధనల ప్రకారం ఇసుక అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ట్రాక్టర్లు రైతు పొలాల నుండి వెళ్ళినట్లయితే సంబంధిత రైతుకు నష్టపరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి మన ఇసుక వాహనం ద్వారా సరఫరా చేయడంతో స్థానిక ట్రాక్టర్ నిర్వాహకులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మొదటిసారి జరిమానా, 2వ సారి వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం చెన్నూర్ శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో 80లక్షల రూపాయల విలువైన వ్యవసాయ పరికరాలను రాయితీ క్రింద రైతులకు అందజేశారు. మండలంలోని కన్నెపల్లి, లంబాడిపల్లి ఐ.కె.పి. సెంటర్ గ్రౌండ్ లో నిర్వహించిన ముగ్గుల పోటీకిలకు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

అంతకు ముందు జిల్లా కలెక్టర్ చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమీకృత కూరగాయల మార్కెట్ ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 12:** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన గంగారపు మొగిలి అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా తన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కన్నాల 8 వ వార్డు సభ్యులు బామండ్లపల్లి స్వామి, నాయకులు ఆసంపల్లి నర్సయ్య, అక్కల కృష్ణస్వామి, నల్లని వెంకటరావు లు పాల్గొన్నారు.



## కార్మెల్ పాఠశాలలో ఘనంగా వార్షిక క్రీడలు

**జనోదయ, మందమర్రి జనవరి 12:** పట్టణం లోని కార్మెల్ పాఠశాలలో 2026 సంవత్సర వార్షిక క్రీడలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలకు కార్మెల్ ఎడ్యుకేషనల్ ప్రెసిడెంట్ సిస్టర్ మారియా అగాస్టిన్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో భాగంగా 800, 400, 200 మీటర్ల పరుగు పందాలు తో పాటు, షార్ట్ పుట్, రిలే పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పిఈటి గా విధులు నిర్వహించి విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచుతూ, విద్యార్థులను చైతన్య పరుస్తూ క్రమశిక్షణతో తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు కే అమర్ ఈ సంవత్సరం తో పదవి విరమణ పొందబోతున్న సందర్భంగా ఆయనకు శాలువా కప్పి కిరీటం ధరింపజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఫాదర్ జేవిఆర్ రెక్స్ మాట్లాడుతూ, కార్మెల్ వార్షిక క్రీడలు, సంక్రాంతి పండుగ, పదవి విరమణ పొందబోతున్న ఉపాధ్యాయుని సన్మానాలతో కలిపి ఆటల పోటీలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచి, ఓటమితోనే నిజమైన ధైర్యం లభిస్తుందని, గెలుపు కోసం విద్యార్థులు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలని సూచించారు. విద్య క్రమశిక్షణ విధేయతలతో పాటు ఆటల పోటీలు పండుగల సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## మేడిపల్లి మండల కేంద్రంలో స్వామి వివే-కానంద 136వ జయంతి ఉత్సవాలు

జనోదయ, మేడిపల్లి, జనవరి 12: మేడిపల్లి మండల కేంద్రంలో స్వామి వివేకానంద 136వ జయంతి ఉత్సవాలను గ్రామ యువత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవన విధానం, ఆయన సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శప్రాయమని పాల్గొన్నవారు పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, స్వామి వివేకానంద బోధనలు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. "లేచి నిలబడి లక్ష్యాన్ని సాధించే వరకు ఆగవద్దు" అనే ఆయన సందేశం ప్రతి యువకుడికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు కలిగిన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా స్వామి వివేకానంద జీవితం, ఆయన చేసిన సేవలు, భారతదేశ యువతపై ఆయన ప్రభావం గురించి ప్రసంగాలు నిర్వహించారు. యువకులు స్వామిజీ సూక్తులను చదివి వినిపించగా, వాటి ప్రస్తుత ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమం గ్రామంలో స్ఫూర్తిదాయక వాతావరణాన్ని నెలకొల్పింది.

మేడిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఐక్యంగా పాల్గొని ఈ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేశారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు కార్యక్రమానికి హాజరై యువతను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో చైతన్యాన్ని పెంచి సమాజ అభివృద్ధికి దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. మొత్తంగా స్వామి వివేకానంద 136వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు మేడిపల్లి మండల కేంద్రంలో ఉత్సాహభరితంగా సాగి యువతకు కొత్త ప్రేరణను అందించాయి.



# కార్యకర్తల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం.

**కష్టపడే కార్యకర్తలకే ప్రాధాన్యత.**
**డివిజన్ల లోని సంఘాలతో మమేకం కావాలి.**
**వ్యక్తిగత విమర్శలను ప్రచారం చేయొద్దు.**
**పశ్చిమ నియోజకవర్గంలో 3,500 ఇండ్లు నిర్మిస్తాం.**
**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.**



**జనోదయ, హనుమకొండ, జనవరి 12:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం-పార్టీ రెండు కళ్ల సిద్ధాంతాన్ని అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం, కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పని చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

సోమవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్టీ సమీక్షా సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య తో కలిసి ఆయన పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులకు కీలక దిశానిర్దేశం చేశారు. గత రెండేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరంగా అమలు చేస్తూ ప్రజల మధ్య ఉంటున్నామని తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని బూత్ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**26 డివిజన్ లలో కాంగ్రెస్ జెండా ఎగరాలి...**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 26 డివిజన్‌లలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి డివిజన్ నాయకుడు తన పరిధిలోని దేవాలయాలు, మసీదులు, సంఘాలు, కమిటీలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు.

జనవరిలో ప్రతి డివిజన్‌లో ఒక రోజు చొప్పున పర్యటన చేపడతానని తెలిపారు. ఎవరు కష్టపడి పనిచేస్తారో, ప్రజల్లో ఉంటారో వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో కుల, జనాభా ప్రాతిపదికన టికెట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు.

**ప్రజల సమస్యలను నమోదు చేసుకో-వాలి...**

గత ఎన్నికల్లో ప్రతి బూత్ వారీగా వచ్చిన ఓట్ల వివరాల జాబితాను నాయకులు దగ్గర పెట్టుకోవాలని, స్లం ఏరియాల్లో ఉన్న సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. డివిజన్‌లో అధికారులతో పర్యటించినప్పుడు ఇప్పటికే జరిగిన పనులు, ఇంకా చేయాల్సిన పనులపై స్పష్టంగా వివరించాలని ఆదేశించారు.

డివిజన్ పర్యటనలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆ డివిజన్ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. భోజనం అనంతరం కుల పెద్దల ఇళ్లలో టీ బ్రేక్ ఉంటుందని, ఆ సమయంలో గ్రూప్ రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండాలని హెచ్చరించారు. డివిజన్ స్థాయితోనే కాకుండా బూత్ స్థాయిలో ఎందుకు ఓటింగ్ తగ్గుతుందో విశ్లేషణ చేసుకోవాలని సూచించారు.

**అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు...**

నియోజకవర్గంలో 7 ఎకరాల భూమిని గుర్తించామని, దానిపై సుమారు 3,500 ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని తెలిపారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ, ఇంటర్నల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక పనులు చేశామని, ఈ అభివృద్ధిని ప్రజల్లో ధైర్యంగా చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వం, ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులనే ప్రచారం చేయాలని, వ్యక్తిగత విమర్శలు, అనవసర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఎవరో చెప్పారని కార్పొరేటర్ టికెట్ అడగకూడదని, ముందుచూపుతో డివిజన్ అధ్యక్షులను బలోపేతం చేయాలని తెలిపారు. సీఎంను నిధులు అడిగేటందుకు అవకాశం ఉంటుంది...

నియోజకవర్గ సమస్యలను స్పష్టంగా తెలియజేస్తే ముఖ్యమంత్రి వద్ద నిధులు కోరేందుకు అవకాశం ఉంటుందని, అందుకే ప్రతి ఒక్కరు పూర్తి స్థాయిలో డివిజన్‌లో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లా-డుతూ...**

కాంగ్రెస్ పార్టీ అంటేే పదవుల కోసం కాదు ప్రజా సేవే లక్ష్యంగా పనిచేసే సిద్ధాంత బద్ధమైన పార్టీ అని నిరూపించాలని అన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ నాయకులు రౌడీయిజం, అరాచక రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతి డివిజన్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాస్ రావు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామగుండం నగర పాలక సంస్థ తుది ఓటరు జాబితా విడుదల

**జనోదయ, రామగుండం జనవరి 12:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్‌కు అనుగుణంగా రామగుండం నగర పాలక సంస్థకు సంబంధించిన తుది ఓటరు జాబితాను సోమవారం అధికారికంగా విడుదల చేశారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీహరి, టీపీఎస్ నవీన్, రిటర్నింగ్ ఆఫీసర్ ఆంజనేయులు, రిటర్నింగ్ ఇన్‌స్పెక్టర్లు శంకర్‌రావు, ఖాజా, టీపిబీఓలు హిమజ, సింధూజ పాల్గొని తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు.

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉండగా, వీటిలో కలిపి మొత్తం 1,83,049 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇందులో 91,441 మంది పురుష ఓటర్లు, 91,578 మంది మహిళా ఓటర్లు ఉండగా, ఇతరులు 30 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రానున్న నగర పాలక సంస్థ ఎన్నికలకు ఈ తుది ఓటరు జాబితా కీలక ఆధారంగా నిలవనుందని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఓటరు జాబితా అందరికీ అందుబాటులో ఉంచినట్లు, ఎలాంటి సందేహాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని వారు సూచించారు.



## టీం పంచముఖి ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం

**జనోదయ, మందమర్రి జనవరి 12:** స్వామి వివేకానంద 163 వ జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవం వేడుకలను టీం పంచముఖి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ, మండల తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ లు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు కృష్ణ చైతన్య ఆచార్య మాతృమూర్తి పెరుందేవి తాయారు 25వ వర్ధంతిని పురస్కరించుకొని సింగరేణి సివిక్ కాంట్రాక్టు కార్మికులకు చీరలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ, వివేకానంద జయంతి రోజు ఆలయ అర్చకులు తన తల్లి జ్ఞాపకార్థం మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని యువతను సన్మార్గంలో నడిపించేందుకు టీం పంచముఖి సభ్యులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. యువత ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేవ అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి, వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు అనంతచార్యులు, టీం పంచముఖి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శంకర్ రావు, భక్తులు పాల్గొన్నారు.



# మన శంకర వరప్రసాద్'లో గౌడ పాత్రకు గౌరవం
## :యువజన నేత పవన్ గౌడ్

జనోదయ జగిత్యాల జనవరి 12 ::
'మన శంకర వరప్రసాద్' చిత్రంలో గౌడ సంఘానికి గౌరవం పెరిగేలా పాత్రను చూపించారని జిల్లా గౌడ మోకు దెబ్బ యువజన అధ్యక్షుడు బొంగాని పవన్ గౌడ్ అన్నారు. సోమవారం విడుదలైన ఈ చిత్రాన్ని ఆయన తన మిత్రులతో కలిసి వీక్షించి, సినిమా పై స్పందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినిమాలో వెంకటేష్ పోషించిన గౌడ పాత్ర ఎంతో ఆత్మవిశ్వాసంతో, గౌరవప్రదంగా చూపించారని తెలిపారు. సమాజంలో గౌడ కులస్తుల ప్రతిష్ఠను పెంచేలా ఈ పాత్ర ఉండటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సాధారణంగా సినిమాల్లో కొన్ని వర్గాలను తక్కువగా చూపించే పరిస్థితులు ఉంటాయని, అయితే 'మన శంకర వరప్రసాద్' చిత్రంలో అలాంటివేమీ లేకుండా గౌరవప్రదంగా, సానుకూలంగా చూపించడాన్ని అభినందించారు.

వెంకటేష్ తన పాత్రలో అద్భుతంగా నటించారని, గౌడ పాత్రకు ప్రాణం పోసినట్లు అనిపించిందని ఆకుల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. అలాగే హీరో చిరంజీవి నటన కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఆయనతో కలిసి వెంకటేష్ నటించడం సినిమాకు మరింత బలాన్ని చేకూర్చిందని చెప్పారు. ఇద్దరు హీరోల కలయిక ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా చిత్ర యూనిట్‌కు, ముఖ్యంగా హీరోలు చిరంజీవి, వెంకటేష్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తూ, సినిమా ఘన విజయం సాధించాలని కోరారు. ఇలాంటి చిత్రాలు సమాజంలో సానుకూల సందేశాన్ని అందిస్తాయని, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసేలా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఆకుల వెంకటేష్ గౌడ్, గోడిసేలా తిరుపతి గౌడ్, ఆకుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొని సినిమాను కలిసి వీక్షించారు. వారు కూడా చిత్రంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, గౌడ పాత్రను గౌరవంగా చూపించినందుకు చిత్ర బృందాన్ని అభినందించారు.



# రాజకీయాలకతీతంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

జనోదయ కరీంనగర్ | జనవరి 12:

కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మో త్సవాల్లో (ఈనెల 23 నుంచి) రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులంతా పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభా కర్ పిలుపునిచ్చారు. సోమవారం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు బ్రహ్మోత్సవాల సన్నా హక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం మరింత వైభవంగా నిర్వహిస్తా మని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ను కూడా ఆహ్వా నిస్తున్నామని, వారితోపాటు అన్ని పార్టీల వారు. ప్రజలంతా కుటుంబికులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. భక్తులు ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గతేడాది మాదిరిగానే స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగస్వామ్యం అయ్యేందుకు వచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్రెడ్డి మాట్లాడుతూ.. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అన్ని సమన్వయంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగేలా





చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, ఈవో సుధాకర్, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు అంజనీకు మార్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్రెడ్డి, ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, పలువురు దాతలు పాల్గొన్నారు..

# వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

జనోదయ గంగాధర | జనవరి 12:

గంగాధర మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో సోమవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బూరుగుపల్లిలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు చెనోజుల మునిందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అన్నల్దాస్ తిరుపతి, వార్డు సభ్యులు లంక హరిబాబు, గౌడ నరేష్, బొమ్మకంటి రాజిరెడ్డి, దూలం తిరుపతి గౌడ్, పున్నకనకయ్య, ఈడగొట్టి రమేష్, బైరి చంద్రయ్య, యాదగిరి, లక్ష్మణ్,జగన్, విష్ణు, హరీష్,గణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే గ్రామ యువతతో పాటు బూరుగుపల్లి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పండగవేళ మందుబాబులకు షాకింగ్ న్యూస్

జనోదయ కరీంనగర్ | జనవరి 12: సంక్రాంతి పండగ నేపథ్యంలో మందుబాబులకు ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. మద్యం ధరలు పెంచుతూ ఏపీ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయం మేరకు (ఇండియా మేడ్ ఫారిన్ లిక్కర్)తోపాటు ఫారిన్ లిక్కర్ బాటిళ్ల (ఎం ఆర్ పి) పై రూ.10 పెంచారు. దాదాపు అన్ని సైజుల మద్యం బాటిళ్లపై ఈ పెంపు వర్తించనుండగా.. సామాన్యులు ఎక్కువగా కొనుగోలు చేసే రూ.99 ధర ఉన్న 180 మిల్లీలీటర్ల క్వార్టర్ బాటిళ్లకు మాత్రం మార్పు లేదు. అలాగే బీర్, వైన్, రెడీ టు డ్రింక్ ఉత్పత్తుల ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు బార్లపై ఉన్న అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం ను ప్రభుత్వం రద్దు చేసింది. దీని వల్ల వచ్చే ఆదాయ నష్టాన్ని భర్తీ చేసుకోవడానికి మద్యం ధరలు పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మార్పులతో ప్రభుత్వానికి ఏటా సుమారు రూ.1,391 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని అంచనా. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ల వెలుపల 5 కి.మీ. పరిధిలో త్రీస్టార్ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి హోటళ్లలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా సోమవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.



# గంగాధర ఎస్సై, ఎంపీడీఓలకు కలిసిన వర్డ్ మెంబర్స్ ఫోరం సభ్యులు



జనోదయ గంగాధర | జనవరి 12:
గంగాధర ఎస్సై వంశీకృష్ణను, ఎంపీడీఓ రాముని, వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు మేడి సుమన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసిన గ్రామ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో గంగారెడ్డి, మహేష్, మనోహర్ చారి, ప్రశాంత్, కనుకయ్య, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్ఛార్జిగా ఆర్కే నాయుడు

జనోదయ కరీంనగర్ | జనవరి 12:

జన సేన పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోదావరిఖని చెందిన ఆర్కే నాయుడు అలియాస్ ఆర్కే సాగర్ ను ఉమ్మడి జిల్లా ఇన్ ఛార్జిగా నియమించింది. అడాక్ కమిటీని వేసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అయిదుగురికి చోటు కల్పించింది. కరీంనగర్కు న్యాంతాబాద్ జనార్దన్, పెద్దపల్లికి రావుల మధు, హుస్నాబాద్కు తగరపు శ్రీని వాస్, చొప్పదండికి శివారెడ్డి, మంథనికి మాయ రమేశ్ ను నియమించింది. వీరు గ్రామ, మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో కమిటీలు వేయనున్నారు. పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే నాయుడు మంగళవారం కరీంనగర్ రానున్నారు. పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించనున్నారు.



విలేకర్లు కావలెను
సీనియర్ జర్నలిస్ట్ మానసాని కృష్ణా రెడ్డి సంపాదకత్వం,సారథ్యంలో వెలువడుతున్న తెలుగు ప్రింట్ దినపత్రిక జనోదయకు ఖాళీల మేర విలేకర్లు కావలెను
వివరాలకు..
9618616110
8074124190
అవసరమైన వార్తలు
అర్థవంతమైన విశ్లేషణలు
అర్థమయ్యే సంపాదకీయాలు
అన్నివర్గాల అంతరంగాలు
చదవండి.. చదివించండి
తెలుగు దినపత్రిక
జనోదయ
వాస్తవం
నీతిని వీడకుండా
నిజాన్ని కప్పిపుచ్చకుండా
ఉన్నది ఉన్నట్లుగా
5యేండ్లుగా
నిరాటకంగా వెలువడుతూ
రెండు తెలుగు రాష్ట్రాల్లో
అశేష పాఠాకాదరణ పొందిన
నిఖార్సయిన
తెలుగు డిజిటల్ దినపత్రిక
వాస్తవం మీడియాకు
ఖాళీల మేర విలేకర్లు కావలెను
అదుపులేని విమర్శలు
అనవసర శపథాలు
సీఎం నోటి నుంచి ఆ మాటలా?
Manasani Krishna Reddy

## మెగా మాస్ ర్యాంపేజ్.. ఫస్ట్ డే కలెక్షన్స్

'మన శంకర వరప్రసాద్ గారు'తో మెగాస్టార్ చిరంజీవి మరోసారి బాక్సాఫీస్ రేసులోకి దిగారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో సినిమా వసూళ్ల పరంగా దూసుకుపోతోంది.

చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబినేషన్‌పై విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొనగా, వెంకటేష్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నాడన్న వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. దీనికి అనుగుణంగా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా భారీగా నమోదయ్యాయి. ప్రీమియర్స్‌తో కలిపి తొలి రోజు వరల్డ్‌వైడ్‌గా రూ.35 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

పాజిటివ్ టాక్ కారణంగా తెలుగునాట రెండో రోజు బుకింగ్స్ మరింత ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు భారీగా తరలివస్తుండటం విశేషం. ఉత్తర అమెరికాలోనూ సినిమా మంచి స్పందన పొందుతూ ఇప్పటికే 1.5 మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరినట్లు సమాచారం. ఈ జోరు కొనసాగితే మొదటి రోజు తెలుగురాష్ట్రాల్లో రూ.40 కోట్లకు పైగా, వరల్డ్‌వైడ్‌గా రూ.60 కోట్ల గ్రాస్ వసూలు చేసే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సంక్రాంతి సీజన్‌కు అనుగుణంగా పూర్తిస్థాయి వినోదాన్ని అందించేలా రూపొందించిన ఈ సినిమా, ముఖ్యంగా హాస్యం, కుటుంబ భావోద్వేగాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే కథా కథనాలు, లాజిక్ పరంగా లోతైన విశ్లేషణతో చూస్తే కొంతమందికి నిరాశ కలగవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ వింటేజ్ మెగాస్టార్‌ను చూడాలి, కుటుంబంతో కలిసి నవ్వుకోవాలి అనుకునే ప్రేక్షకులకు 'మన శంకర వరప్రసాద్ గారు' మంచి వినోదాన్ని అందిస్తున్నదనే మాట వినిపిస్తోంది.



## ట్యాగ్ చేసినందుకు హత్య... ఆసక్తిక-రంగా శోభిత 'చీకటిలో' ట్రైలర్

శోభితా ధూళిపాళ్ల ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'చీకటిలో'. ఈ చిత్రం జనవరి 23 నుంచి ప్రముఖ డిజిటల్ వేదికలో ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది.


ఈ చిత్రంలో సంధ్య అనే యువతిగా శోభితా కనిపిస్తున్నారు. ఆమె ముందుగా ఒక వార్తా ఛానల్‌లో యాంకర్‌గా పనిచేస్తూ, ఆ తర్వాత ఆ ఉద్యోగాన్ని వదిలి స్వంతంగా ఒక వార్తా వేదికను ప్రారంభిస్తారు. ఈ క్రమంలో తన స్నేహితుల హత్యలకు సంబంధించిన రహస్యాన్ని వెలికితీయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. ఒక్కొక్కటి బయటపడుతున్న కొద్దీ కథ మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది.

ట్రైలర్‌లో హత్యలకు కారణం ఏమిటి? ఒక సామాజిక మాధ్యమ సందేశంలో పేరు చేర్చడమే హత్యలకు కారణమా? అనే ప్రశ్నను చివర్లో వదిలి ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచారు. సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం చివరి వరకు ఆసక్తిగా సాగేలా ఉందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

శోభితా పాత్ర చాలా ధైర్యంగా, నిర్ణయాత్మకంగా కనిపించడం విశేషం. స్నేహితుల కోసం నిజాన్ని వెలికితీయాలనే తపనతో ఆమె ఎదుర్కొనే పరిస్థితులు కథకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. దర్యాప్తు, ప్రమాదకర పరిస్థితులు, భావోద్వేగ ఘట్టాలు అన్నీ సమతుల్యంగా చూపించినట్లు ట్రైలర్ సూచిస్తోంది.

దర్శకుడు కథను వేగంగా, ఉత్కంఠగా చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. నేపథ్య సంగీతం, దృశ్యాల రూపకల్పన కూడా కథకు తగినంత బలాన్ని ఇస్తున్నాయి. ముఖ్యంగా చివర్లో వచ్చే ప్రశ్నతో ప్రేక్షకుల్లో సినిమా చూడాలనే ఆసక్తిని పెంచేలా ట్రైలర్ రూపొందించారు.

మొత్తానికి 'చీకటిలో' చిత్రం స్నేహం, నిజం కోసం పోరాటం, రహస్య హత్యల వెనుక ఉన్న కారణాలు అనే అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. జనవరి 23 నుంచి విడుదలకానున్న ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన అందుకుంటుందో చూడాల్సి ఉంది.



## సినిమా ట్రోల్స్ పై స్పందించిన అనిల్ రావిపూడి



దళపతి విజయ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'జన నాయకన్' చిత్రం ఇటీవల వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సెన్సార్ సంబంధిత అడ్డంకులు ఎదురవడంతో విడుదలపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో మరోవైపు తెలుగు ప్రేక్షకుల నుంచి కూడా ఈ చిత్రంపై విమర్శలు వస్తున్నాయి. ఈ చిత్రం నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో వచ్చిన 'భగవంత్ కేసరి' చిత్రానికి పునర్నిర్మాణమని పలువురు వ్యాఖ్యానిస్తూ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేస్తున్నారు. ట్రైలర్ చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ వివాదంపై తాజాగా 'భగవంత్ కేసరి' చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి స్పందించారు. ఇటీవల ఓ మీడియా ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయంపై మాట్లాడారు. విజయ్ సినిమా ట్రైలర్‌లో కనిపించిన నాలుగు సన్నివేశాల ఆధారంగా అది పూర్తిగా 'భగవంత్ కేసరి' పునర్నిర్మాణమని చెప్పడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. 'భగవంత్ కేసరి'లోని ప్రధాన ఆలోచన వారికి నచ్చి ఉండొచ్చు. దానికి అనుగుణంగా మార్పులు చేసుకుని కొత్తగా రూపొందించి ఉండవచ్చని అన్నారు. అలాగే తమిళ ప్రేక్షకులకు ఈ కథ పూర్తిగా కొత్తదేనని అనిల్ రావిపూడి తెలిపారు. అక్కడి ప్రేక్షకులు 'భగవంత్ కేసరి' చిత్రాన్ని ఎక్కువగా చూడలేదని, అందువల్ల వారికి ఇది కొత్త అనుభూతిని ఇస్తుందని చెప్పారు. కథలోని భావోద్వేగాలు, దేశభక్తి, కుటుంబ విలువలు వంటి అంశాలు ప్రతి భాష ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక విజయ్‌కు ఇది చివరి చిత్రం కావచ్చన్న ప్రచారం ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా ఆయనకు మంచి పేరు, గుర్తింపు తీసుకువస్తుందని తాను నమ్ముతున్నట్లు అనిల్ రావిపూడి తెలిపారు. వివాదాలు పక్కనపెట్టి ప్రేక్షకులు సినిమాను సినిమా గానే చూడాలని, పూర్తిగా చూసిన తర్వాతే అభిప్రాయం వ్యక్తం చేయాలని ఆయన సూచించారు.

## అదృష్టం అంటే శివానీదే!



కొందరికి సినిమా అవకాశాలు అన్నవి అనుకోకుండా వస్తాయి. కెరీర్ ప్లానింగ్ లో సినిమా లేకపోయినా? అనూహ్యంగా వచ్చిన అవకాశాలతో ఈ రంగంలో స్థిరపడిన వారు చాలా మంది ఉన్నారు. నటుడు రాహుల్ రామకృష్ణ ఇండస్ట్రీలో ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే సక్సెస్ అయ్యాడు. టాలీవుడ్ లో స్థిరపడ్డాడు. `అర్జున్ రెడ్డి` చిత్రం అతడి జీవితాన్నే మార్చేసింది. ఇంకా ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారు. తెలుగు అమ్మాయి శివానీ నాగరం కడూఆ అలాగే క్లిక్ అయినట్లు తెలిపింది. శివానీ సినిమాల్లోకి రావాలని ముందెప్పుడు అనుకోలేదంది.ఓ షార్ట్ ఫిల్మ్ కోసం తొలిసారి కెమెరా ముందుకొచ్చింది. ఆ గుర్తింపుతోనే సినిమా అనే థాట్ మనసులో మొదలింది. అటుపై `అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్` లో ఛాన్స్ అందుకుంది. ఆ చిత్ర దర్శక, నిర్మాతలు యూట్యూబ్ లో చూసి అమ్మడిని అప్రోచ్ అవ్వడం..పాత్రకు సెట్ అవుతుందని భావించి ఎంపిక చేసారు. తొలి సినిమా షూటింగ్ సమయం లో చాలా టెన్షన్ పడింది. కానీ ఇప్పుడా టెన్షన్ పోయి నటిగా ధైర్యంగా పని చేస్తోంది. ఆ తర్వాత నటించిన `లిటిల్ హార్ట్స్` కూడా మంచి విజయం అందుకుంది. ప్రస్తుతం కొత్త అవకాశాలు బాగానే వస్తున్నాయి.ఈ నేపథ్యంలో కాలమే తనని స్టార్ గా మార్చిందని..తనని తాను ఎప్పుడూ అలా ఊహించుకోలేదంది శివానీ.తాను నటిని అయినా బ్యూటీ విషయంలో చాలా సింపుల్ గా ఉంటానంది. చర్మ సంరక్షణ కోసం క్రీములు వాటికి దూరంగా ఉంటానంది. వీలైనంత వరకూ నేచురల్ గా కనిపించడానికి ఇష్టపడతానంది. శరీరానికి కావాల్సినన్నీ నీళ్లు మాత్రం క్రమం తప్పకుండా తాగుతానంది. రాత్రి సమయంలో మాత్రం మాయిశ్చరైజర్ తప్పనిసరిగా వాడుతానంది. వారానికి ఒకసారి చర్మానికి పెసరడిండి మాత్రం రాస్తానంది.ఇక టాలీవుడ్ లో నటీమణుల మధ్య ఎలాంటి కాంపిటీషన్ ఉందన్నది తెలిసిందే. ఒక్క ఛాన్స్ కోసం ఎంతో మంది క్యూలో ఉన్నారు. స్థానిక భామలతో పాటు ముంబై, చెన్నై, కేరళ, బెంగుళూరు ప్రాంతాల నుంచి దిగుమతి అవుతోన్న వారి సంఖ్య అంతకంతకు కనిపిస్తోంది. సాధారణంగా తెలుగు హీరోయిన్లకు అవకాశాలివ్వడానికి దర్శక, నిర్మాతలు కూడా ముందుకు రారు. స్థానిక నటులతో కొన్ని రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని భయం కూడా ఓ కారణం. వాటన్నింటిని బ్రేక్ చేసి శివానీ ఛాన్సులు అందుకుంటుంది. ఇంత వరకూ గ్లామర్ పాత్రల్లో నటించలేదు. మరి ఆ తరహా పాత్రల విషయంలో శివానీ ఎలా స్పందిస్తుందో చూడాలి.



## సమంతపై రాజ్ తల్లి ఇంట్రెస్టింగ్ కామెంట్స్..

ప్రముఖ స్టార్ హీరోయిన్ సమంత.. నాగచైతన్య నుంచి విడిపోయిన తర్వాత కెరియర్ పై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. బాలీవుడ్లో వెబ్ సిరీస్ లు చేస్తూ బిజీగా మారిన ఆమె ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థను కూడా స్థాపించింది. ఆ నిర్మాణ సంస్థ ద్వారా 'శుభం' అనే సినిమాను నిర్మించి.. మంచి సక్సెస్ అందుకుంది. ఇందులో మాయ అనే ఒక చిన్న పాత్ర కూడా పోషించింది. ఇకపోతే కెరియర్ పైనే కాదు వ్యక్తిగత జీవితంలో కూడా సెటిల్ కావాలనుకున్న సమంత.. అందులో భాగంగానే ఫ్యామిలీ మెన్ 2 వెబ్ సిరీస్ చేస్తున్న సమయంలోనే ఆ వెబ్ సిరీస్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారగా.. డిసెంబర్ 1న కోయంబత్తూర్ లోని ఈషా యోగా సెంటర్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో భూత శుద్ధి పద్ధతిలో వివాహం చేసుకున్నారు.వివాహాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సమంత తన ఇన్స్టాగ్రామ్ వేదికగా పెళ్లి ఫోటోలను పంచుకుంది. దీంతో అభిమానులు, సెలబ్రిటీలు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సమంత స్నేహితురాలు శిల్పారెడ్డి కూడా షేర్ చేసింది. ఇదిలా ఉండగా తాజాగా సమంతపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది ప్రముఖ సింగర్, రాజ్ చిన్నమ్మ శోభ రాజ్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె.. సమంత, రాజ్ పెళ్లి గురించి ఆసక్తికర విషయాలు పంచుకోవడమే కాకుండా సమంత గురించి ఎవరికీ తెలియని కొన్ని నిజాలు కూడా ఆమె బయట పెట్టింది.ోభా రాజ్ మాట్లాడుతూ.." సమంత మా కుటుంబంలోకి కోడలుగా రావడం మా అదృష్టం. చాలా మంచి అమ్మాయి. పద్ధతిగా ఉంటుంది. పెళ్లి చీరలో చాలా ముచ్చటగా అనిపించింది. ముఖ్యంగా ఆ అమ్మాయి మా రాజ్ జీవితంలోకి రావడం మరింత సంతోషంగా ఉంది" అంటూ తెలిపింది. అలాగే సమంత గురించి మాట్లాడుతూ.. "ఈషా ఫౌండేషన్ లో సమంతను ఇప్పటికే రెండు మూడు సార్లు కలిసాను. ఆ సమయంలో ఆమె చాలా సన్నగా ఉండేది. అంత సన్నగా ఉన్న అమ్మాయి పక్కన కూర్చోవాలంటే నాకు సిగ్గుగా అనిపించింది. అప్పుడే నేను కూడా కొంచెం సన్నగా అవ్వాలంటే ఏం చేయాలని అడిగాను. అయితే నాకు కొన్ని వర్కౌట్స్ చెప్పింది. అయితే అవి ఫాలో అవ్వడం నావల్ల కాదని సమంతతో చెప్పేసాను. అలా ఆమెతో నాకు మంచి పరిచయం ఏర్పడింది. ఆమె చాలా మంచి అమ్మాయి. అందరి మంచి కోరుకునే అమ్మాయి. అలాంటి అమ్మాయి మా జీవితంలోకి రావడం మరింత సంతోషంగా అనిపిస్తుంది. ముఖ్యంగా దేవుడిపై ఎంతో భక్తి ఉన్న అమ్మాయి. రాజ్ కి కూడా దైవభక్తి ఎక్కువ" అంటూ సమంతపై తన ప్రేమను వలకబోసింది సమంత అత్త.